క్లుప్తంగా

నేడు ముఖ్య కార్యకర్తల సమావేశం

తలకొండపల్లి: కల్వకుర్తి పట్టణంలోని కేసీఆర్ ఫంక్షన్ హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యఅతిథిలుగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లురవి, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహ్మారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఎమ్మెల్యేలు, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ హాజరవుతున్నారని మోహన్‌రెడ్డి చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తలు, బీఎల్‌ఓలు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు నాయకులు అందరు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

కడ్తాల్: అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. గురువారం మండలంలోని మైసిగండిలో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని నిర్మాణ దారుడికి సూచించారు. అభివృద్ధిలో మండలాన్ని మొదటిస్థానంలో నిలపడమే లక్ష్యమని, అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యం, నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అర్చకులు, గురువులు

కడ్తాల్: మండల పరిధిలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీలో నేనావత్ శివనాయక్ ఆధ్వర్యంలో ఎత్తం రామలింగేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దాత నేనావత్ శివనాయక్‌ను గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మికత, భక్తి భావం పెంపొందుతుందని గిరిజన గురువులు అన్నారు. కార్యక్రమంలో గిరిజన గురువులు బీచ్యాబావోజీ, రాజుబావోజీ, కిరణ్‌బావోజీ, నాయకులు రవికుమార్, బీచ్యా, సక్రు,రాజు, జైపాల్, కృష్ణ, పాండు, రఘు, నరేశ్ ప్రజలు పాల్గొన్నారు.

కాలానికి అనుగుణంగా పరిశోధనలు

మొయినాబాద్ రూరల్: ప్రస్తుత ప్రపంచంలో ప్రజలకు ఉపయోగపడేవిధంగా, కాలానికి అనుగుణంగా పరిశోధనలు చేయాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వికరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగంలో 'న్యూ క్యాటిలిటిక్ సిస్టమ్స్ ఫర్ సమ్ సెలెక్టివ్ పీ-సీ అండ్ సీ ఎటిరో అటామ్ బాండ్ ఫార్మేషన్ ఇన్ కెమికల్ సింథాసిస్' అనే అంశంపై ప్రొఫెసర్ సి నర్సింహ్మాస్వామి పర్యవేక్షణలో మహ్మద్ ముభీద్ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీహెచ్ పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డిలు మహ్మద్ ముభీద్‌ను అభినందించి డాక్టరేట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, ప్రొఫెసర్ కవిత, రీసెర్చ్ డీన్ ఆచార్య కిష్టఫర్, డీన్ సైన్స్ ప్రొఫెసర్ సుందర్‌రామ్, అడ్మినిస్ట్రేషన్ డీన్ రాజు, పబ్లిక్ రిలేషన్ గాదే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో తన కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీలో నిలబడితే ప్రజలందరూ తనను ఎంతో ఆదరించారని గుర్తు చేసుకున్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటమి సహజమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై అందరు దృష్టి సారించాలని చెప్పారు. ప్రతిఒక్కరూ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగితే ఎన్నికల్లో విజయం సాధించడం సులభమన్నారు. ఈ సమావేశంలో విజయ్ భాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, శివారెడ్డి, మాణిక్యం, మోహన్‌సింగ్, లక్ష్కర్ నాయక్ పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే!



ఉత్సవ మూర్తులు

- కనుల పండువగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం
- హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రజాప్రతినిధులు, భక్తులు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు

కడ్తాల్: మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం భక్తుల జయజయ ధ్వనుల మధ్య గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో కల్యాణోత్సవం కోసం ఏర్పాటు చేసిన మండప వేదిక అందంగా, పచ్చటి మామిడి తోరణాలతో, తమల పత్ర పుష్పాలతో చూడముచ్చటగా, కడురమణీయంగా అలంకరించారు. అంతకు ముందు బ్యాండు మేళాలతో స్వామివారి తలంబ్రాలు, పట్టువస్త్రాలకు ఊరేగింపు నిర్వహించి, ఆలయానికి తీసుకువచ్చారు. స్వామివారికి పట్టు వస్త్రాలను కందికంటి సుధాకర్‌గౌడ్ బహూకరించగా, పుస్తె మెట్టెలను కృష్ణమూర్తి అందజేశారు. వేడుకల కోసం చెన్నకేశవస్వామి, భూదేవి అమ్మవారి విగ్రహాలను పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. అనంతరం వేదపండితులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలోని పండిత బృందం వేద మంత్రోచ్చరణల మధ్య లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం మహోత్సవ వేడుకలను భక్తజనుల గోవింద నామస్మరణ మధ్య కనుల పండువగా సాగింది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అనంతరం భాస్కర్‌రెడ్డి భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు,



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ అర్చకులకు అండగా ఉంటా

జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



విరాళం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో నిత్య పూజలు గావిస్తున్న అర్చకులకు అండగా ఉంటానని, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాదికి సంబంధించిన రూ.60 వేలను, ఆలయ అర్చకులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయంలో పనిచేసే అర్చకులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు, తన జీవితాంతం ప్రతి సంవత్సరం రూ.60 వేలను ఆలయ అర్చకులకు అందజేస్తానన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ఆలయ చైర్మన్ ఆంజనేయులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు రండి



ఎంపీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న శ్రీనివాసామూర్తి, నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో వెలిసిన వేదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు మార్చి 5న ప్రారంభమై 7న ముగియనున్నాయి. ఆలయ ధర్మకర్త శ్రీనివాసామూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి గురువారం హైదరాబాద్‌లో ఎంపీ రాములును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. స్వామివారికి పెళ్లికి రావాలని బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసామూర్తి, ప్రొద్దుటూర్ అశోక్, వెంకట్‌రెడ్డి, బోయ నర్సింహ, ఎంఈఓ సర్దార్ నాయక్, జంగయ్య సార్, అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మాడ్గుల: మండలం పరిధిలోని ఇర్విన్ గ్రామంలో గురువారం సీసీ రోడ్ల నిర్మాణానికి మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు సూదిని శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా సూదిని శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామానికి రూ.20 లక్షలు సీసీరోడ్ల నిర్మాణానికి మంజూరు అయినట్లు చెప్పారు. అలాగే, ఇర్విన్ గ్రామ పరిధిలోని రెడ్డిపురం గ్రామానికి రూ.5 లక్షలు, దిల్‌వర్ ఖాన్‌పల్లి, గ్రామానికి రూ. 5లక్షలు మంజూరు అయ్యాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ నాయకులు చంద్రయ్య, వెంకటేశ్ గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, శివగౌడ్, శ్రీశైలం , పర్వతాలు, సుధాకర్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నర్సింగ్ సిబ్బంది



ఆస్పత్రిలో విధులలో చేరిన సిబ్బంది

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం నూతన నర్సింగ్ సిబ్బంది విధుల్లో చేరారు. ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి 14 మంది నర్సింగ్ సిబ్బందిని కేటాయించారు. డా.జయశ్రీ,, డా.మంజులాదేవి సమక్షంలో భూలక్ష్మి, గాయత్రి, సాయిలక్ష్మి, రేణుక, అనూష, జ్యోతీమేరి విధుల్లో చేరారు.

ఘనంగా మాతాపితరుల దినోత్సవం

షాద్‌నగర్: సంత ఆసారాం బాపూజీ ఆశ్రమం, యోగా వేదాంత సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో రాఘవేంద్ర కాలనీలోని రంగరాయ ఆడిటోరియంలో మాతృ, పితృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ అమర్‌నాథ్, శరత్‌లు మాట్లాడారు. తల్లిదండ్రులు దైవ సమానులని, వారిని గౌరవించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. నేటి సమాజంలో పాశ్చాత్య పోకడలు అధికమయ్యాయని, సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోతున్నారన్నారు. పిల్లలు పెద్దయ్యాక జన్మనిచ్చిన తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నారన్నారు. దీంతో వారు అనాథ ఆశ్రమాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

నేటి పొదుపు.. రేపటికి మదుపు

షాద్‌నగర్ : నేడు మనం చేసుకునే పొదుపు రేపటి జీవితానికి ఎంతగానో ఉపయోగపడుతుందని కరూర్ వైశ్యాబ్యాంక్ షాద్‌నగర్ బ్రాంచ్ మేనేజర్ నర్ర సంతోష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కరూర్ వైశ్యా బ్యాంక్‌లో మేనేజర్ నర్ర సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో షాద్‌నగర్ శాఖ రెండో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఖాతాదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నర్ర సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఖాతాదారుల ఆర్థికాభివృద్ధికి కరూర్‌వైశ్యా బ్యాంక్ ఎంతో కృషి చేస్తుందన్నారు. తక్కువ వడ్డీరేట్లకే రుణాలు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

యాచారం: మండలంలోని కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గోదాదేవి పద్మావతి, వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉ.8 గంటల నుంచి నాదస్వర సుప్రభాతం, పంచామృత అభిషేకం , సహస్రనామవళి పూజ, మంగళహారతి, మంత్ర పుష్పం పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణోత్సవం నిర్వహించారు. గోవిందా నామస్మరణలతో దేవాలయ ఆవరణ మార్మోగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి

జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ కృపేష్



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ఇబ్రహీంపట్నం : గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలని జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ కృపేష్‌లు పేర్కొన్నారు. మండలం పరిధిలోని కప్పపహాడ్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ మహిపాల్‌లు ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలంతా కలిసి కట్టుగా ఉండి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భరత్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఇంద్రాసేనారెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హంసమ్మ, మాజీ ఉప సర్పంచ్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి మార్గంలో నడవాలి

మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్



ప్రత్యేక పూజలు చేస్తున్న శ్రీనివాస్ యాదవ్

తలకొండపల్లి: ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో నడవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. మండల పరిధిలోని పాతకోటతండాలో గురువారం ధ్వజస్తంభ, ప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. అభిషేకం, అఖండదీపారాధన, ఏకవీర రుద్రాయణం, హనుమాన్ చాలీసా, తదితర పూజలను కన్నుల పండువగా చేశారు. శ్రీనివాస్ యాదవ్ హాజరై స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.17,000 విరాళం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అలివేలు, జీరానాయక్, తౌర్యానాయక్, శ్రీను, గోపి, రమేశ్, మల్లేశ్, గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే శిక్షార్హులు



మాట్లాడుతున్న భానుప్రకాశ్

కొందుర్గు: బాల, బాలికలకు వివాహ వయస్సు రాకముందే పెళ్లిళ్లు చేస్తే చట్ట ప్రకారం వారు శిక్షార్హులు అవుతారని బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారి భానుప్రకాశ్ పేర్కొన్నారు. గురువారం కొందుర్గు కేజీబీవీలో బాలల, చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలను అక్రమ దత్తత తీసుకోవడం, అక్రమ రవాణ చేయడం, మైనర్లను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాలపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం షాద్‌నగర్ ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, కేజీబీవీ ప్రత్యేకాధికారి శకీనా నిస్సీ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తీసుకోని వారికి జరిమానా

కమిషనర్ సత్యనారాయణరెడ్డి



వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని వ్యాపారులంతా సంస్థలకు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని పుర కమిషనర్ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఫిబ్రవరిలో వ్యాపార లైసెన్స్‌లను తీసుకోని పక్షంలో 50 శాతం జరిమానా విధించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం పలువురు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడంతో కమిషనర్ వారిని అభినందించారు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని మహోనియా ఆస్పత్రి, వైష్ణవి, బాలాజీ, కీర్తన కోల్డ్ స్టోరేజీ, అగ్ర స్వీట్స్, ఎస్‌పీఆర్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్స్, కావ్య సిరామిక్స్ వ్యాపార సంస్థలకు నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, వినయ్‌కుమార్, ఇఇ హరీశ్, సిబ్బంది భానుమతి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభించి, క్రికెట్ ఆడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: గ్రామాల్లో క్రీడలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆరుట్ల గ్రామంలో యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిభను చాటేలా ఆడాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో కలిసి మెలసి ఆడుకోవాలన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. గ్రామీణస్థాయి నుంచి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదిగారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కావలి శ్రీనివాస్, నాయకులు గుడ్డిమల్లచంద్రయ్య,మారసురేష్, రమణారెడ్డి, సురేష్, భాస్కర్, అశోక్, సికిందర్‌రెడ్డి, నాగరాజు, రాఘవేందర్, శ్రీనివాస్, శంకర్, రాయుడు,ప్రవీణ్, శివ పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు కృషి

తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మన్నె వెంకటేశ్

చేవెళ్ల: జిల్లాలోని ముదిరాజ్‌ల ఉపాధికి ఉపయోగపడే చెరువుల పరిరక్షణకు ఫిషరీస్ సొసైటీ కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు మన్నే వెంకటేశ్ పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ఫిషరీస్ సొసైటీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నూతన అధ్యక్షుడిగా తెలుగు వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. అనంతరం మన్నే వెంకటేశ్ మాట్లాడుతూ జిల్లాలోని చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. వాటిని కాపాడుకోవలసిన బాధ్యత ఫిషరీస్ సొసైటీలపై ఉందన్నారు. అనంతరం నూతన నూతన అధ్యక్షుడు తెలుగు వెంకటేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులను ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఫిషరీస్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ అధ్యక్షుడు తెలుగు రాఘవేందర్, సొసైటీ సభ్యులు మాణిక్యం, శ్రీనివాస్, లింగం, మాసయ్య, వెంకటయ్య, పోచయ్య, ఆనంద్, జనార్దన్, రాజశేఖర్, రాజేశ్, అంజయ్య, గణేశ్, రాజు, బద్రి, శ్రీకాంత్, రమేశ్, వెంకటేశ్, రమేశ్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్, నవాబ్‌పేట మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

శివరాత్రికి మల్లిఖార్జునుడు ముస్తాబు

- మార్చి6 నుంచి 10 వరకు మల్లప్పగుట్ట మల్లిఖార్జున స్వామి బ్రహ్మోత్సవాలు
- పోటెత్తనున్న భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



మల్లప్పగుట్ట మల్లిఖార్జునస్వామి ఆలయం

తలకొండపల్లి: మండలంలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట మల్లిఖార్జునస్వామి శివాలయం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. బ్రహ్మోత్సవాలకు హైదరాబాద్, షాద్‌నగర్, శంషాబాద్, అచ్చంపేట్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, వికారాబాద్, తదితర పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. భక్తుల కొంగుబంగారమై, కోరిన కోర్కెలు నెరవేర్చె స్వామిగా ప్రసిద్ధి చెందడమే గాకుండా, శ్రీశైలం మల్లిఖార్జునస్వామిగా పేరుగాంచింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. సుమారుగా 5 లక్షల మంది భక్తులు రానున్నారని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకల సదుపాయాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మాకం పాండయ్య వివరించారు. తాగునీరు, భక్తులకు కావాల్సిన తదితర సౌకర్యాలను సమకూర్చనున్నట్లు తెలియజేశారు. గుట్టకింది భాగం నుంచి పైభాగం వరకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేశారు. దీంతో టూ, త్రీ, ఫోర్ వీలర్లు తదితర వాహనాల్లో భక్తులు సునాయాసంగా పైకి వెళ్లనున్నారు. ఫలితంగా భక్తుల తాకిడి పెరగనుంది. భక్తుల మనోభావాలకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు చెప్పారు.

మార్చి 6 నుంచి 10 వరకు బ్రహ్మోత్సవాలు

ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలు జరుగును. మార్చి 6న ఆలయ అష్టమ వార్షికోత్సవ కార్యక్రమం జరుగనుంది. గణపతి పూజ, ఏకవార రుద్రాభిషేకం, పాశుపత రుద్రహోమం, 7న శివగీతా కార్యక్రమం, రాత్రి భజన కార్యక్రమం, దేవుని సేవ, అగ్నిగుండ మహోత్సవం, 8న ఉదయం 11.35 గంటలకు భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి కల్యాణ మహోత్సవం, 9న ఉదయం 11 గంటలకు కడవ బోనాల కార్యక్రమం, 10న చక్రతీర్థ, పెద్ద మంగళారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు పాండయ్య తెలిపారు.